నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శుక్రవారం 26 జనవరి 2024 | BHADRADRI KOTHAGUDEM


# ఓటును పారదర్శకంగా వినియోగించాలి

## ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, జనవరి 25 : వజ్రాయుధం లాంటి ఓటును ఎన్నికల సమయంలో పారదర్శకంగా వినియోగించుకోవాలని, మంచి పాలన అందించే వారిని ఎన్నుకోవాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ పిలుపునిచ్చారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ ఎన్నికల కమిషన్ అందించిన సందేశాన్ని ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు ప్రాముఖ్యతను మరింత బలోపేతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా 2011 నుంచి జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. 2024లో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో అర్హులైన ఓటర్లందరూ పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. దేశ భవిష్యత్తు ఓటరు చేతిలోనే ఉంటుందన్నారు. సీనియర్ ఓటర్లు ప్రతి ఎన్నికల్లోనూ ఓటు వేస్తూ మనకు ఆదర్శంగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. కాగా.. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ జ్ఞాపికలు అందజేశారు. సీనియర్ సిటిజన్‌లను ఈ సందర్భంగా సన్మానించారు. జిల్లాలో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్నందుకు వారిని అభినందించి.. వారికి ఓటరు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా స్వీప్ నోడల్ అధికారి, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరామ్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్.స్వామి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు వజ్రాయుధం : భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల




ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ప్రియాంక, అధికారులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 25 : ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కొత్తగూడెం పట్టణంలోని పోస్టాఫీస్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ బెలూన్లను గాలిలోకి ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన తర్వాత ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేసుకొని.. ఐదేళ్లకు ఒక్కసారి ఎన్నికలు నిర్వహించుకుంటున్నామని అన్నారు. నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం కోసం 2011, జనవరి 26 నుంచి జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని అన్నారు. అనంతరం నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అందరితో ఓటు హక్కు వినియోగానికి సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవో శిరీష, తహసీల్దార్ పుల్లయ్య, డీటీ అంజద్ పాషా పాల్గొన్నారు.

# అసాంఘిక శక్తులపై నిఘా పెట్టాలి

## భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు



కొత్త పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, జనవరి 25 : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, అసాంఘిక శక్తులపై గట్టి నిఘా పెట్టాలని భద్రాద్రి జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు అన్నారు. నూతనంగా నిర్మించిన చుంచుపల్లి మండల పోలీస్‌స్టేషన్‌ను గురువారం సందర్శించిన ఆయన తాత్కాలికంగా కొత్త భవనంలో ప్రారంభమైన సేవలను పరిశీలించారు. స్టేషన్‌లోని ఏర్పాట్లు, అక్కడికి వచ్చే ఫిర్యాదుదారులకు ఉండాల్సిన సౌకర్యాల విషయంలో లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో 5ఎస్ విధానం కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఎస్పీ వెంట కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, చుంచుపల్లి సీఐ పెద్దన్నకుమార్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.కరుణాకర్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, పోలీస్ పీఆర్వో దాములూరి శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

# రెండో వంతెన నిర్మాణం ఇంకెన్నాళ్లు?

- భద్రాచలం వద్ద గోదావరిపై మరో బ్రిడ్జి నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ అలసత్వం
- ఇక రైల్వే స్టేషన్ ఆధునీకరణ, రైళ్ల పునరుద్ధరణ, రైల్వే లైన్ పొడిగింపూ అంతేనా?
- 'దిశ' సమావేశంలో కేంద్రంపై మండిపడ్డ ఎంపీలు నామా, మాలోత్ కవిత
- గత కేసీఆర్ పాలనలోనే వైద్యసేవల్లో విప్లవాత్మక మార్పులని స్పష్టీకరణ
- అంబులెన్సులపై తన ఫొటో తొలగింపుపై ఖమ్మం ఎంపీ ఆగ్రహం
- హాజరైన జడ్పీ చైర్మన్ కంచర్ల, ఎమ్మెల్యేలు వెంకట్రావు, రాందాస్‌నాయక్




దిశ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీలు మాలోత్ కవిత, నామా నాగేశ్వరరావు. చిత్రంలో ఎమ్మెల్యే, కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : గోదావరి నదిపై భద్రాచలం వద్ద రెండో బ్రిడ్జి నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని మహబూబాబాద్, ఖమ్మం ఎంపీలు మాలోత్ కవిత, నామా నాగేశ్వరరావు విమర్శించారు. నేషనల్ హైవేస్ అధికారులతో ఎంకెన్నాళ్లకు పూర్తి చేయిస్తారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం భద్రాద్రి కొత్తగూడెం ఐడీవోసీలో డీఆర్‌డీవో మధుసూదనరాజు అధ్యక్షతన గురువారం జరిగింది. కలెక్టర్ ప్రియాంక పాల్గొన్న ఈ సమావేశంలో ఎంపీ నామా మాట్లాడుతూ.. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సదరు కాంట్రాక్టర్లతో చర్చించి ఆ రెండో బ్రిడ్జీ నిర్మాణ పనులను పూర్తి చేయించాలని సూచించారు. అలాగే, రైల్వే అధికారుల తీరుగా సక్రమంగా లేదని మండిపడ్డారు. గత సమావేశానికి కూడా సరైన సమాచారం లేకుండా వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగూడెంలో రైల్వేస్టేషన్ ఉన్నా సరిపడినన్ని రైళ్లు నడపకపోవడం దారుణమన్నారు. గతంలో రద్దు చేసిన రైళ్లను ఎప్పుడు పునరుద్ధరిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. పాండురంగాపురం నుంచి భద్రాలం వరకు కేవలం 17 కిలోమీటర్ల దూరం రైల్వేలైన్ నిర్మించలేకపోతున్నారని విమర్శించారు. రైల్వే విభాగం అధికారులు వచ్చే సమావేశాలకైనా స్పష్టమైన సమాధానాలతో హాజరుకావాలని సూచించారు. తన కోటాలో అంబులెన్సులను మంజూరు చేస్తే వాటిపై తన ఫొటోను ఎందుకు తొలగించారంటూ వైద్యశాఖ అధికారులపై ఎంపీ నామా మండిపడ్డారు. అలాగే బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు మారుమూల గ్రామాల్లో సెల్‌టవర్లు నిర్మించడం లేదని విమర్శించారు.

**అధికారులపై కలెక్టర్ సీరియస్..**

సమగ్ర నివేదికలు, సరైన సమాధానాలు లేకుండా దిశ సమావేశానికి వచ్చిన అధికారులపై కలెక్టర్ ప్రియాంక సీరియస్ అయ్యారు. దిశ మీటింగ్ అనేది సాధారణ సమావేశం కాదని, ఎంతో ముఖ్యమైన ఈ సమావేశాన్ని సాదాసీదాగా తీసుకుంటే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సమావేశ ప్రశ్నలకు సరైన సమాధానం కూడా పంపకుండా ఈ సమావేశానికి మళ్లీ ఎలా వచ్చారని ప్రశ్నించారు. రైల్వే అధికారులతో సమీక్ష ఏర్పాటు చేయాలని డీఆర్‌వోను ఆదేశించారు. వచ్చే సమావేశాల నాటికి ఇలాంటివి పునరావృతం కాకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

# కేఎంసీ కమిషనర్‌కు ప్రశంసాపత్రం




గవర్నర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆదర్శ్ సురభి

ఖమ్మం, జనవరి 25 : ఓటరు నమోదు అధికారి క్యాటగిరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి ప్రశంసాపత్రం అందుకున్నారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో రాష్ట్ర గవర్నర్ తమిళిసై కమిషనర్ ఆదర్శ్ సురభికి గురువారం ప్రశంసాపత్రం అందజేశారు.

### గత కేసీఆర్ ప్రభుత్వంలోనే అద్భుతమైన వైద్య సేవలు: ఎంపీ కవిత



గత కేసీఆర్ ప్రభుత్వ పాలనలోనే ఇక్కడి ప్రజలకు అద్భుతమైన వైద్య సేవలు అందాయని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. కేవలం గత సీఎం కేసీఆర్ కృషి వల్లనే వైద్యసేవల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, ప్రతి ఇంటికీ ప్రభుత్వ వైద్యం చేరువైందని స్పష్టం చేశారు. అలాగే, మూత్రపిండాల సమస్యలకు డయాలసిస్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత గత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం ఆయా కేంద్రాల్లో అదనపు బెడ్లు ఏర్పాటు చేయాల్సి ఉందని అన్నారు.

### గైనకాలజిస్టులను నియమించాలి: ఎమ్మెల్యే తెల్లం



భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో గైనకాలజిస్టుల కొరత ఉన్నందున వెంటనే అక్కడ ప్రసూతి వైద్యులను నియమించాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. అక్కడి గైనకాలజిస్టులు లేకపోవడం వల్ల గర్భిణులు కొత్తగూడెం రావాల్సి వస్తోందని అన్నారు. అలాగే తాలిపేరు ప్రాజెక్టుకు మూడు గేట్లు వేయాలని, అక్కడి రైతులను ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. మూడు గేట్లు నిర్మిస్తే అక్కడి పొలాలకు సమృద్ధిగా సాగునీరు అందుతుందని అన్నారు. అలాగే రెగ్యులర్ టీచర్లను నియమించి ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపర్చాలని సూచించారు. ప్రతి నియోజకవర్గానికీ ఒకటి చొప్పున సదరం క్యాంపులు ఏర్పాటు చేయాలని, రహదారుల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరారు.

### కోతుల బెడద నివారించాలి: ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జడ్పీ చైర్మన్ కంచర్ల

గ్రామాల్లో కోతుల బెడదను నివారించాలని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, భద్రాద్రి జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు కోరారు. కోతుల వల్ల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున పంచాయతీరాజ్ శాఖ అధికారులు చొరవ తీసుకొని వాటిని అదుపు చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలోని డయాలసిస్ సెంటర్‌లో అదనపు బెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. త్రీటౌన్ సెంటర్ నుంచి హేమచంద్రాపురం వరకు డబుల్ రోడ్ నిర్మాణం నిలిచి పోయినందున దానిని పూర్తి చేయాలని కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్ ఆవరణలో పారిశుధ్య పనులు చేయడం లేదని, నేషనల్ హైవే వద్ద డ్రైనేజీ నిర్మాణాలు నిలిచిపోయాయని అన్నారు. దిశ కమిటీ సభ్యులు కే.వెంకటేశ్వర్లు, పరంజ్యోతిరావు, ఆళ్లపల్లి, చర్ల, దుమ్ముగూడెం, గుండాల ఎంపీపీలు తమ మండలాల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.






# మద్దులపల్లి మార్కెట్ ఆదాయం హాం ఫట్!

- ఖమ్మం ఏఎంసీ ట్రెజరీకి తరలుతున్న కోల్డ్‌స్టోరేజీల సెస్
- క్రయవిక్రయాలు ఇక్కడ.. ఆదాయం అక్కడికి..
- శాంపిల్స్ సాకుతో వ్యవసాయ అధికారుల నిర్వాకం
- ఆదాయానికి గండిపడడంతో గ్రేడింగ్‌పై ప్రభావం
- నాలుగేండ్లు దాటినా 'మద్దులపల్లి'కి దక్కని హోదా



నిర్మాణదశలో మార్కెట్

మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ ఆదాయానికి భారీగా గండిపడుతున్నది. సాధారణంగా వ్యవసాయ మార్కెట్ పరిధిలోని జిన్నింగ్ మిల్లులు, సైంటిఫిక్ గోడౌన్‌లు, కోల్డ్‌స్టోరేజీలు, రైస్‌మిల్లులు, చెక్‌పోస్టులు మొత్తం సదరు మార్కెట్ పరిధిలోకి వస్తాయి. మార్కెట్‌లో జరిగిన క్రయవిక్రయాలకు సంబంధించిన ఆదాయంతోపాటు ఇతర వనరుల నుంచి పన్నులు సైతం ఆ మార్కెట్ ట్రెజరీలో జమకావడం సర్వసాధారణం. అయితే ఖమ్మంరూరల్ మండల పరిధిలోని మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ విషయంలో ఇందుకు భిన్నమైన పరిస్థితి కనపడుతున్నది.

ఖమ్మం రూరల్, జనవరి 25 : రైతుల సౌలభ్యం, ఏటేటా పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నుంచి 2018 సంవత్సరంలో విడిపోయి మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్‌గా అధికారికంగా రూపాంతరం చెందింది. నూతన మార్కెట్ నిర్మాణం, ఇతర అవసరాల నిమిత్తం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నుంచి నిధులు సైతం మద్దులపల్లి మార్కెట్‌కు బదలాయించడంతోపాటు, ఉద్యోగుల విభజన కూడా జరిగింది. భౌతికంగా మార్కెట్ నిర్మాణం లేకపోయినప్పటికీ ఇతర వనరుల ద్వారా ఉద్యోగులు రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ నిర్దేశించిన లక్ష్యాలకు మించి ఆదాయం సమకూర్చగలిగారు. 2019-20లో రూ.74.59 లక్షలు, 2020-21లో రూ.3.72 కోట్లు, 2021-22లో రూ.1.86 కోట్లు, 2022-23లో రూ.1.87 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ సంవత్సరానికి(2023-24) గాను రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ రూ.3 కోట్ల ఆదాయం టార్గెట్‌గా పెట్టింది. ప్రస్తుతం మద్దులపల్లి మార్కెట్ పరిధిలో ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం(మొత్తం 44 గ్రామాలు) మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1 చెక్‌పోస్టు, 4 జిన్నింగ్ మిల్లులు, 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన సైంటిఫిక్ గోడౌన్‌లు, 4 రైస్‌మిల్లులు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు 8 కోల్డ్‌స్టోరేజీలు(8 లక్షల బస్తాల సామర్థ్యం) ఉన్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ కోల్డ్‌స్టోరేజీల ఆదాయం మాత్రం మద్దులపల్లి మార్కెట్‌కు అందకపోవడం విస్మయానికి గురిచేస్తున్నది.

**శాంపిల్స్ సాకుతో.. ఆదాయానికి భారీ గండి**

మద్దులపల్లి మార్కెట్ పరిధిలో ప్రస్తుతం 8 కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయి. వీటిలో సుమారు 8 లక్షల బస్తాలను నిల్వ పెట్టుకునే సామర్థ్యం ఉంది. ఏటా రైతులు 4 లక్షల బస్తాలను నిల్వ చేసుకుంటున్నారు. క్వింటాల్ ధర తక్కువలో తక్కువ రూ.15 వేలు పలికినప్పటికీ ఏటా ఈ కోల్డ్‌స్టోరేజీల ద్వారా మార్కెట్‌కు సుమారు రూ.1.50 కోట్ల నుంచి రూ.2 కోట్ల పైబడి ఆదాయం వస్తుంది. అయితే మార్కెట్ ఏర్పడి ఐదేండ్లు కావస్తున్నప్పటికీ కోల్డ్ స్టోరేజీల ద్వారా వచ్చే ఆదాయం మద్దులపల్లి మార్కెట్ ట్రెజరీలోకి వెళ్లడం లేదు. ఎందుకంటే కోల్డ్‌స్టోరేజీలో ఉన్న పంటను అమ్ముకునే సమయంలో ఖరీదుదారుడికి పంట మొత్తంలో నుంచి ఒక బస్తాను శాంపిల్‌గా చూపించాల్సి ఉంటుంది. ఈ కారణంతో రైతులు మండల పరిధిలోని కోల్డ్‌స్టోరేజీలో నిల్వ చేసుకున్న పంటలో నుంచి ఒక బస్తాను శాంపిల్ కోసం ఖమ్మం ఏఎంసీకి తీసుకెళ్తున్నారు. దీంతో అక్కడి ఖరీదుదారులు కొనుగోలు చేస్తున్నందున తమ మార్కెట్‌కే ఆదాయం రావాలనే ఉద్దేశంతో కోల్డ్‌స్టోరేజీల ఆదాయం ఖమ్మం ఏఎంసీకి ట్రెజరీకి చేరుతున్నది. అయితే మండల పరిధిలో ఉన్న జిన్నింగ్‌మిల్లుల వద్ద సీసీఐ పత్తి కొనుగోళ్ల ఆదాయం మాత్రం మద్దులపల్లి మార్కెట్‌కు వస్తున్నది. కేవలం మిర్చి పంట విషయంలోనే అలా జరుగుతుండడంతో మార్కెట్ ఆదాయానికి భారీగా గండి పడుతున్నది. కేవలం శాంపిల్స్ మాత్రమే అక్కడ జరుగుతుండగా, కాంటాలు ఇతర ప్రక్రియ మొత్తం కోల్డ్‌స్టోరేజీల వద్దనే జరుగుతున్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నూతన మార్కెట్‌లో చిన్నపాటి ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేసినట్లైతే శాంపిల్స్ సైతం ఇక్కడే చూసుకునే అవకాశం ఉంటుంది. తద్వార ఇక్కడి ఆదాయం ఈ మార్కెట్‌కే చెందనున్నది.

### నాలుగేండ్లు గడిచినా హోదా లేకపాయే!

మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ ఏర్పడి నాలుగేండ్లు పూర్తయ్యింది. అయినా నేటివరకు రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ మద్దులపల్లి మార్కెట్‌కు ఎలాంటి హోదా ఇవ్వలేదు. సాధారణంగా కొత్త మార్కెట్ ఏర్పడితే మూడు సంవత్సరాల తర్వాత గ్రేడింగ్ ఇస్తుంటారు. అలాంటిది నాలుగేళ్లు పైబడినా ఇంత వరకు అతీగతీ లేదు. మార్కెట్ ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకొని సదరు మార్కెట్‌కు గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 హోదా ఇవ్వాల్సి ఉంటుంది. హోదాను బట్టి సెక్రటరీల నియామకం ఉంటుంది. కానీ మద్దులపల్లి మార్కెట్‌కు పర్యవేక్షకుడు మాత్రమే సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మార్కెట్ నిర్మాణం పూర్తికాకపోయినప్పటికీ ఇతర వనరులైన చెక్‌పోస్టు, జిన్నింగ్ మిల్లులు, రైస్‌మిల్లులు, ఐకేపీ తదితర మార్గాల ద్వారా ఏటా సరాసరి రూ.2.50 కోట్ల నుంచి రూ.3 కోట్ల ఆదాయం సమకూర్చుతున్నారు. అయితే మార్కెట్ ఆదాయానికి గండిపడడంతో ఆ ప్రభావం హోదాపై పడి తద్వార మార్కెట్ అభివృద్ధి విషయంలో సైతం తీవ్ర ప్రభావం చూపనున్నది. ఇప్పటికైనా మార్కెట్‌కు గ్రేడ్ ప్రకటించి అదనపు సిబ్బందిని నియమించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

### కోల్డ్‌స్టోరేజీల విలీన ప్రక్రియ కొనసాగుతోంది



మద్దులపల్లి మార్కెట్ పరిధిలోని మొత్తం కోల్డ్‌స్టోరేజీలను ఆ మార్కెట్ పరిధిలోకి తీసుకొచ్చే ప్రక్రియ కొనసాగుతున్నది. కొద్ది రోజుల క్రితం మద్దులపల్లి మార్కెట్ ఇన్‌చార్జి సెక్రటరీ ఈ విషయంపై దరఖాస్తు పెట్టారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొద్దిరోజుల్లో ప్రక్రియ పూర్తి అవుతుంది.

– ఎంఏ అలీం, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి

# గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

- ప్రగతి, ఫలాలపై శాఖల వారీగా శకటాలు, స్టాళ్ల ప్రదర్శన
- పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు..
- ఉద్యోగులు, అధికారులకు 'ఉత్తమ' పురస్కారాలు
- ఏర్పాట్ల పరిశీలనలో ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్



పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ సునీల్‌దత్

మామిళ్లగూడెం, జనవరి 25: పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం ఉదయం నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై ఐడీవోసీలో గురువారం సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో శాఖల వారీగా సమీక్షించి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిపై శకటాలు, స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే, అధికారులు, ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాల విషయంలో అన్ని పారామీటర్లను ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, వివిధ శాఖల అధికారులు విద్యాచందన, సోమశేఖర్‌శర్మ, మహ్మద్ గౌస్, సత్యనారాయణ, జ్యోతి, సత్యనారాయణరెడ్డి, గణేశ్, జయప్రకాష్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

**ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, సీపీ..**

ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న గణతంత్ర వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ సునీల్‌దత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఇబ్బందులు తలెత్తకుండా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. రిహార్సల్స్ తదితర అంశాలపై చర్చించారు. జెండా ఆవిష్కరణ, ముఖ్య అతిథి ప్రసంగం అనంతరం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని అన్నారు. పోలీసు అధికారులు కుమారస్వామి, హరికృష్ణ, ప్రసన్నకుమార్, నర్సయ్య, సుశీల్‌సింగ్, స్వామి, కామరాజు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# 'శ్రీరాముల'కు ఇండియన్ పోలీస్ మెడల్



శ్రీరాముల మోహన్‌కుమార్, పంజాగుట్ట ఏసీపీ

అశ్వారావుపేట, జనవరి 25 : హైదరాబాద్ పంజాగుట్ట ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న దమ్మపేట మండలం పట్వారీగూడెంకు చెందిన శ్రీరాముల మోహన్‌కుమార్ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియన్ పోలీస్ మెడల్ అందుకోనున్నారు. 1995లో ఎస్ఐగా ఉద్యోగం సాధించిన ఆయన అంచలంచెలుగా ఏసీపీ స్థాయికి ఎదిగారు. ఇప్పటి వరకు 516 క్యాష్ రివార్డులు, జీఎస్ఈ, ఎంఎస్ఈ, కమెండేషన్స్‌తోపాటు కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్కృష్ట సేవా పతకం అందుకున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి నుంచి మెడల్, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సేవా పతకం పొందారు. కాగా.. మోహన్‌కుమార్ 2024 ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపిక కావడం పట్ల మండల ప్రజలు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

# ఖమ్మం మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 25 : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవు ప్రకటించినట్లు ఇంచార్జ్ సెక్రటరీ బజార్ ఒక ప్రకటనలో తెలిపారు. 26న గణతంత్ర దినోత్సవం, 27న వారాంతపు యార్డు బంద్, 28న వారాంతపు సెలవు ఉంటుందని, 29వ తేదీ నుంచి యథావిధిగా మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. రైతులు ఈ విషయాన్ని గ్రహించి సహకరించాలని ఆయన కోరారు.








